త్వరలో కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు

- వరుస ఎన్నికలతో రియల్ మార్కెట్‌లో స్తబ్దత
- పుంజుకున్నాకే నిర్ణయం తీసుకోవాలని విన్నపం

రెండు నెలలుగా తిరోగమనం ఇలా..

నెల	రిజిస్ట్రేషన్ల సంఖ్య (లక్షల్లో)		వ్యత్యాసం
	2023-24	2024-25	
ఏప్రిల్	1.55	1.22	-21.29
మే	1.75	1.50	-21.36

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచి, ఆగస్టు 1 నుంచి అమల్లోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై రియల్‌ఎస్టేట్‌రంగం ప్రముఖులు, మార్కెట్ నిపుణులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకోవాలని భావించడం సమంజసమే అయినా, ప్రస్తుతం రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ రంగం పరిస్థితిని కూడా పరిగణనలోనికి తీసుకోవాలని హితవు చెప్తున్నారు. చార్జీలు పెంచే ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానున్నది. అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు సమావేశం నిర్వహించి, భూముల మార్కెట్ విలువల సవరణపై చర్చించనున్నారు. తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు, సెజ్‌లు, ఇతర వాణిజ్య కార్యకలాపాలు ఎక్కువగా ఉండి, భూముల ధరలు క్రమంగా పెరుగుతున్న, తగ్గుతున్న గ్రామాలను గుర్తిస్తారు. జాతీయ, రాష్ట్ర రహదారులకు సమీపంలో ఉన్న గ్రామాలను ప్రత్యేకంగా పరిగణిస్తారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయేతర భూముల బహిరంగ ధరలను లెక్కలోకి తీసుకుని మార్కెట్ విలువను సవరిస్తారు. వ్యవసాయ భూములకు సంబంధించి రెవెన్యూ, పంచాయతీ అధికారుల నుంచి వివరాలు సేకరించి ధరలను సవరిస్తారు. పట్టణ ప్రాంతాల్లో.. వాణిజ్య ప్రాంతాలు, ప్రధాన రహదారులు, కాలనీలు, వసతులు, అంతర్గత సదుపాయాలు, మౌలిక వసతులు వంటివి పరిగణనలోకి తీసుకొని ప్రాంతాలవారీగా విలువలను నిర్ణయిస్తారు. మార్కెట్ విలువల సవరణను ఈ నెల 23 నాటికి పూర్తి చేస్తారు. ఆ తర్వాత అభ్యంతరాలు ఏమైనా ఉంటే 25వ తేదీ వరకు సమీక్షిస్తారు. ఆ తర్వాత కమిటీ ఆమోదం కోసం పంపుతారు. ఈ నెల 29న కమిటీ ఆమోదం తెలిపిన తర్వాత.. సవరించిన విలువలను జూలై 1న వెబ్‌సైట్‌లో ప్రచురిస్తారు. జూలై 20 వరకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటి ఆధారంగా ధరల్లో ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే చేసి.. జూలై 31న వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. ఆ మరుసటి రోజు నుంచి.. అంటే ఆగస్టు 1 నుంచి సవరించిన ధరలు అమల్లోకి రానున్నాయి. స్టాంపు డ్యూటీ పెంచుతారా? లేదా? అనేదానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదు. ప్రస్తుతం మార్కెట్ విలువలో స్టాంపు డ్యూటీ 5.5 శాతంగా ఉన్నది. దీనికి ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 0.5%, రిజిస్ట్రేషన్ చార్జీలు 1.5% కలిపి రిజిస్ట్రేషన్ ఫీజు మార్కెట్ విలువలో 7.5 శాతంగా ఉన్నది.

కొంతకాలం ఆగితే నయం

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో రియల్‌ఎస్టేట్ రంగంపై ప్రభావం పడే అవకాశం ఉన్నదని వ్యాపారులు, మార్కెట్ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో భూముల విలువ బాగా పెరిగినప్పుడో, క్రయవిక్రయాలు జోరుమీద ఉన్నప్పుడో ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే పెద్దగా ప్రభావం కనిపించదని చెప్తున్నారు. కానీ, రాష్ట్రంలో గత ఏడాది సెప్టెంబర్ నుంచి వరుసగా ఎన్నికలు, కొత్త ప్రభుత్వాలు, ఎన్నికల కోడ్ వంటి పరిణామాలు, ఇతర కారణాలతో రియల్‌ఎస్టేట్ రంగం స్తబ్దుగా ఉన్నదని అంటున్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది మొదటి రెండు నెలల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్య సగటున 23% తగ్గుదల నమోదైందని ఉదహరిస్తున్నారు. గత మూడు నెలల్లో గమనించినా 20% తగ్గుదల ఉన్నదని వివరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పెంపు సరైన నిర్ణయం స్పష్టం చేస్తున్నారు. సాధారణంగా పిల్లల పై చదువుల కోసం ఆస్తుల విక్రయం, పిల్లల చదువులపై పెట్టుబడి పూర్తయితే కొత్త ఆస్తుల కొనుగోలు, సెలవుల నేపథ్యంలో కుటుంబాలకు ఎక్కువగా తీరిక సమయం దొరకడం తదితర కారణాల వల్ల మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో లావాదేవీలు అత్యధికంగా ఉంటాయని చెప్తున్నారు. ఇలాంటి సమయంలో తిరోగమనం నమోదవడం మంచి సంకేతం కాదని హితవు చెప్తున్నారు. కాబట్టి మార్కెట్‌కు జోష్ వచ్చేలా చేసి, ఆ తర్వాత ధరలు సవరించాలని సూచిస్తున్నారు. లేదంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు.

ఆదాయ లక్ష్యం.. 21 వేల కోట్లు?

మార్కెట్ ధరలను కనిష్ఠంగా 20%, గరిష్ఠంగా 40% వరకు సవరించే అవకాశం ఉన్నది తెలుస్తున్నది. ఈ నెల 18వ తేదీ నుంచి ఆర్థిక మంత్రి వివిధ విభాగాల అధిపతులతో బడ్జెట్ సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో పెంచబోయే ధరలకు అనుగుణంగానే అంచనాలు రూపొందించాలని ఆదేశాలు జారీ అయినట్టు తెలిసింది. గత ఆర్థిక సంవత్సరంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా రూ.18,500 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఈసారి మార్కెట్ ధరల సవరణ నేపథ్యంలో ఆదాయ లక్ష్యం రూ.21 వేల కోట్ల వరకు ఉండొచ్చని చెప్తున్నారు. నిరుడు రూ.14,295 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది కనీసం రూ.19-20 వేల కోట్ల వరకు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం.

నీట్‌పై మాట్లాడరేం?

మొదటిపేజీ తరువాయి...

జరుగుతున్నాయని వార్తలొస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం దారుణమని పేర్కొన్నారు. ప్రతీసారి విద్యార్థులతో పరీక్షాపే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించే ప్రధాని మోదీ కీలకమైన నీట్ పరీక్షపై స్పందించకపోవడం విడ్డూరంగా ఉన్నదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ అంతా సవ్యంగానే జరిగిందంటూ కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉన్నదని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు నీట్ వ్యవహారంలో ఒక్కరిపైనా ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అనేక అనుమానాలు.. సందేహాలు

గతంలో ఎప్పుడూ లేని విధంగా నీట్ ఎగ్జామ్‌లో ఏకంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ రావడం అనేక అనుమానాలకు తావిస్తున్నదని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఒకే పరీక్ష కేంద్రం నుంచి ఎనిమిది మంది విద్యార్థులు ఏకంగా 720 మార్కులు సాధించడం చూస్తే పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతుందని ఆయన ఉదహరించారు. ఒక్క మార్కు తేడాతోనే విద్యార్థుల ర్యాంకులు మారిపోతాయని, ఎంతోమంది అవకాశాలు కోల్పోతారని గుర్తుచేశారు. ఫలితాలను 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాలరోజే ప్రకటించడం కూడా అనేక సందేహాలకు తావిచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు.

గ్రేస్ మార్కులు కలపడమేంటి?

ఈ ఏడాది నీట్‌లాంటి పరీక్షల్లో గ్రేస్ మార్కులు కలపడమేమిటి అని కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ ఏడాది 1,563 మందికి గ్రేస్ మార్కులు కలిపినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)నే చెప్పిందని తెలిపారు. ఆ విద్యార్థులకే ఎందుకు గ్రేస్ మార్కులు ఇచ్చారో, దానికి ఏ ప్రాతిపదికను తీసుకున్నారో స్పష్టం చేయడం లేదని చెప్పారు. +4, -1 విధానం ఉండే ఈ ఎగ్జామ్‌లో సాధ్యంకాని విధంగా కొంత మంది విద్యార్థులకు 718, 719 మార్కులు రావడం కూడా మొత్తం గ్రేస్ మార్కుల విధానంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. గ్రేస్ మార్కులు పొందిన విద్యార్థులకు వాటిని తొలగించి మళ్లీ ఎగ్జామ్ రాయిస్తామని, లేదంటే గ్రేస్ మార్కులు లేకుండా ఉన్న ర్యాంకింగ్‌నే జత చేస్తామంటూ ఎన్టీఏ పూటకో మాట మాట్లాడుతున్నదని మండిపడ్డారు. ఒక్క గ్రేస్ మార్కుల అంశమే కాకుండా నీట్ పేపరే లీకైందంటూ వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని స్పష్టంచేశారు.

మన విద్యార్థులకు నష్టం జరిగితే పోరాటమే..

గ్రేస్ మార్కులు, పేపర్ లీకేజీ ఆరోపణల కారణంగా నీట్ రాసిన తెలంగాణ విద్యార్థులకు ఎలాంటి నష్టం జరిగినా వారి తరపున బీఆర్ఎస్ పోరాడుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో మన విద్యార్థుల తరపున రాష్ట్ర ఎంపీలు చొరవ తీసుకోవాలని, దీనిపై సమగ్ర విచారణకు కేంద్ర సర్కారుపై ఒత్తిడి తేవాలని కోరారు. ఎన్టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) పాత్రపైనా అత్యున్నత దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని కేంద్రాన్ని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో సూచించారు.

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్

'చీఫ్ మినిస్టర్ భట్టి'

మొదటిపేజీ తరువాయి...

కనిపించీ, కనిపించనట్టుగా 'డిప్యూటీ' అని రాసి ఉండటమే ఈ కలకలానికి కారణం. ఈ ఫ్లెక్సీలను గమనిస్తే, సీఎం రేవంత్ రెడ్డా? భట్టి విక్రమార్కనా? అన్న సందేహం కలుగకమానదు. 'భట్టి'నే చీఫ్ మినిస్టర్ అనే అభిప్రాయం కలిగేలా వాటిని ఏర్పాటుచేశారు. భట్టి అభిమానులు ఈ ఫ్లెక్సీల ఏర్పాటులో వారి ఉద్దేశం ఏమిటన్నది కాంగ్రెస్ వర్గాల్లో చర్చకు దారితీసింది. మారుమూల ప్రాంతంలో ఏర్పాటుచేసి ఉంటే ఆ విషయం భట్టి దృష్టికి వెళ్లపోవచ్చు, కానీ ప్రజాభవన్‌కు సమీపంలో బేగంపేటలో వెలిసిన ఫ్లెక్సీలు ఆయన దృష్టికి వెళ్లకుండా, ఆయన చూడకుండా ఎలా ఉంటారు? ఉద్దేశపూర్వకంగానే ఏర్పాటు చేసినట్టు ఉన్నదని కాంగ్రెస్ నాయకుడొకరు వ్యాఖ్యానించారు. గతంలో ప్రభుత్వ ప్రకటనల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫొటోను తొలగించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వర్గాలుగా చీలిపోతుందనడానికి ఈ ఉదంతమే నిదర్శనమనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

ఈవీ ప్రోత్సాహకాలకు బ్రేక్!

- రాష్ట్రంలో రోడ్ ట్యాక్సు, రిజిస్ట్రేషన్ ఫీజుల మోత
- పనిచేయని చార్జింగ్ స్టేషన్లు
- పెట్రోల్ వాహనాలకే ప్రజల మొగ్గు

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): సంప్రదాయ ఇంధన వినియోగాన్ని తగ్గించడంతోపాటు పర్యావరణ అనుకూలమైన రవాణా సదుపాయాలను అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో చేపట్టిన ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) రంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఈవీల కొనుగోళ్లను ప్రోత్సహించడంపై శ్రద్ధ చూపడంలేదు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహకాలు నిలిచిపోవడంతో ఈవీలపై కొనుగోలుదారులు ఆసక్తి చూపడంలేదు. రాష్ట్రంలో ఈవీల వినియోగానికి అవసరమైనన్ని చార్జింగ్ స్టేషన్లు అందుబాటులో లేకపోగా ఇప్పటికే ఏర్పాటు చేసిన స్టేషన్లలో 25 శాతం వరకు పనిచేయడం లేదు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఈవీ పాలసీని ప్రవేశపెట్టి 2 లక్షలు టూ వీలర్లు, 5 వేల కార్లు, 20 వేల ఆటోలకు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీల నుంచి మినహాయింపు ఇచ్చింది. మొదటి దశలోనే 500 చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు మరో 3 వేలకుపైగా స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రజల నుంచి వచ్చే స్పందన ఆధారంగా ప్రోత్సాహకాలను పొడిగించాలని నిర్ణయించింది. కానీ, ఇప్పుడు ఈవీ కొనుగోలుదారుల నుంచి ఆర్టీఏ అధికారులు రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులు వసూలు చేస్తున్నారు. దీంతో పెట్రోల్, డీజిల్ వాహనాలకు, ఈవీలకు తేడా లేకుండాపోయింది. దీంతో ఈవీల కొనుగోలుకు జనం ఆసక్తి చూపడం లేదు. పెట్రోల్ వాహనాలతో పోల్చుకుంటే ఈవీల ధరలు అధికంగా ఉండటంతో మళ్లీ సాంప్రదాయ ఇంధన వాహనాల వైపే మొగ్గు చూపుతున్నారు.

కేరళ కంటే తక్కువ విక్రయాలు

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణలో ఈవీ విక్రయాలు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 1.6 కోట్ల వాహనాల్లో ఈవీలు కేవలం 0.8 శాతమే ఉన్నట్టు ఎఫ్‌టీసీసీఐ వర్గాలు చెప్తున్నాయి. తెలంగాణలో కంటే మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో ఈవీ విక్రయాలు అధికంగా ఉన్నట్టు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఈవీలపై బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన రాయితీలను పునరుద్ధరించాలని, చార్జింగ్ కేంద్రాలను పెంచి వాటి నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని వాహనరంగ నిపుణులు కోరుతున్నారు.

5 రాష్ట్రాల్లోనే 50% విక్రయాలు

గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశవ్యాప్తంగా మొత్తం 41.35 లక్షల ఈవీలను విక్రయించగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి నెలలో 17 లక్షల యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఇందులో టూవీలర్లు 55%, ఆటోలు 32% ఉన్నాయి. మొత్తం విక్రయాల్లో 50% ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాల్లోనే జరగడం విశేషం. 2022-23తో పోల్చుకుంటే గత ఆర్థిక సంవత్సరంలో ఈవీల విక్రయాలు 28% వృద్ధి చెందాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అంతకన్నా ఎక్కువ వృద్ధి నమోదయ్యే అవకాశమున్నదని మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి.

అధ్యక్ష పదవిపై బీజేపీలో వివాదం

- ఈటల రాజేందర్ వద్దంటున్న ఆ పార్టీ సీనియర్లు
- తెరపైకి కాసం వెంకటేశ్వర్లు, రాంచందర్‌రావు పేర్లు

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): బీజేపీలో కొత్త అధ్యక్షుడి నియామకం విషయంలో ఆ పార్టీలో వివాదం నెలకొన్నది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు పగ్గాలు అప్పగించొద్దని ఆ పార్టీలో కొందరు సీనియర్లు అధిష్ఠానం వద్ద వాదన వినిపించినట్టు తెలిసింది. తొలుత ఈటల రాజేందర్ పేరు ప్రముఖంగా వినిపించినా, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా ప్రమాణం చేసిన తర్వాత పరిస్థితిలో మార్పు కనిపిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు విడుదల కాగానే కిషన్‌రెడ్డికి మరోసారి కేంద్ర మంత్రి పదవి ఖాయమని, ఈటల రాజేందర్‌కు పార్టీ పగ్గాలు అప్పగిస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. బండి సంజయ్‌కి పార్టీ జాతీయ స్థాయి పదవి కొనసాగుతుందని అంచనా వేశారు. ఈ దశలో ఎవరూ ఊహించని విధంగా బండి సంజయ్‌కి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి దక్కడంతో అభిప్రాయాల్లో మార్పు కనిపిస్తున్నది. ఆర్ఎస్సెస్, బీజేపీ మూలాలు ఉన్న వ్యక్తులకే ప్రాధాన్యం ఇచ్చిందనే వాదన నెలకొన్నది. ఈ కోణంలో ఈటలకు పదవి అనుమానమే అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ఈటల పార్టీని నడపలేరని ఆ సీనియర్లు ఢిల్లీ పెద్దలకు చెప్పినట్టు తెలిసింది. గతంలో బండి సంజయ్‌పై ఈటల రాజేందర్ పదే పదే ఫిర్యాదులు చేశారని, చేరికల కమిటీ చైర్మన్‌గా విఫలం అయ్యారని వివరించినట్టు సమాచారం. ఈ క్రమంలో కాసం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ రాం చందర్‌రావు పేర్లు తెరమీదికి వచ్చాయి. ఇప్పటికే ఈటలతోపాటు రఘునందన్‌రావు, డీకే అరుణ వంటి వారి పేర్లు కూడా వినిపిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇవేవీ పట్టించుకోకుండా ఈటల రాజేందర్ తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నట్టు సమాచారం.

త్వరలో మద్యం ధరలుపెంపు

మొదటిపేజీ తరువాయి...

పెంపుపై మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలిసింది. ధరల పెంపు వల్ల కలిగే లాభనష్టాలను బేరీజు వేస్తున్నట్టు సమాచారం.

ఇప్పుడు రేవంత్ సర్కారు వంతు..

సాధారణంగా రాష్ట్రంలో ప్రతి రెండేళ్లకు ఒకసారి మద్యం ధరలు పెంచుతుంటారు. రెండేళ్ల క్రితం ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం మద్యం ధరలను పెంచగా.. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వంతు వచ్చింది. అయితే, అధికారంలోకి వచ్చిన వెంటనే ధరలు పెంచితే సర్కారు మీద విమర్శలు వస్తాయనే కోణంలోనూ ప్రభుత్వ పెద్దలు ఆలోచిస్తున్నట్టు తెలిసింది. ప్రభుత్వం ఎప్పుడు మద్యం రేట్లు పెంచినా.. ప్రస్తుతం లభ్యమవుతున్న అన్ని బ్రాండ్ల లిక్కర్ ధరల మీద 20 నుంచి 25 శాతం వరకు పెంచే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఒకవేళ ఇలానే ధరలు పెంచితే ఏటా సర్కారుకు అదనంగా రూ.3 వేల నుంచి మూడున్నర వేల కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది. 2022 మార్చిలో బీఆర్ఎస్ సర్కార్.. లిక్కర్ రేట్లను పెంచింది. దాని ప్రకారం ఈ ఏడాది మార్చిలోనే ధరలను సవరించాల్సి ఉండగా.. పార్లమెంట్ ఎన్నికల కారణంగా వాయిదా పడినట్టు తెలుస్తోంది. ఎన్నికలు పూర్తవటంతో ఇప్పుడు ధరలు పెంచే యోచనలో ఉన్నట్టు సమాచారం.

సంక్షేమ పథకాలకు ప్రత్యక్ష వనరు

సర్కారుకు వస్తున్న ఆదాయ వనరుల్లో మద్యం అమ్మకాలే ప్రధానం. మద్యం విక్రయాల ద్వారా ఏటా సుమారు రూ.37 వేల కోట్ల వరకు సర్కారుకు ఆదాయం సమకూరుతున్నది. ఇప్పుడీ లక్ష్యాన్ని రూ.47వేల కోట్లకు పెంచినట్టు తెలిసింది. ఈ మేరకు ఎక్సైజ్‌శాఖ ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పడిన మంత్రివర్గ ఉపసంఘం ఇటీవల సమావేశమైంది. ఏయే శాఖల నుంచి అదనంగా నిధుల సమీకరణ చేయవచ్చన్న చర్చ జరిగిందని, అందులోనే లిక్కర్ రేట్ల పెంపు అంశం కూడా ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. ఇప్పటికే ఎక్సైజ్‌శాఖ అధికారులు కిందిస్థాయి సిబ్బందికి లక్ష్యానికి అనుగుణంగా టార్గెట్లు ఇచ్చినట్టు సమాచారం. ఒక్కో మద్యం షాపునకు రూ.50 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించినట్టు కూడా తెలిసింది. పొరుగు రాష్ట్రం ఏపీలో గత ప్రభుత్వం కొన్ని లిక్కర్ బ్రాండ్లకు మాత్రమే పర్మిషన్ ఇవ్వడంతో తమకు కావాల్సిన బ్రాండ్ల కోసం ఏపీ ప్రజలు తెలంగాణ సరిహద్దు జిల్లాలకు వచ్చేవారు. ఇప్పుడు అక్కడ ప్రభుత్వం మారడంతో లిక్కర్ పాలసీ కూడా మారుతుందని, అన్ని బ్రాండ్ల లిక్కర్ విక్రయాలకు అనుమతి ఇచ్చే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఏపీ పాలసీని కూడా దృష్టిలో పెట్టుకుని తెలంగాణలో కూడా మద్యం ధరలను పెంచే అవకాశం ఉంటుందని సమాచారం.

గుజరాత్‌లో నీట్ పేపర్ లీక్

- పరీక్ష పేపర్లను అమ్ముకున్నారు
- వెంటనే పరీక్షను రద్దు చేయాలి
- లేకుంటే బీఆర్ఎస్వీ పోరుబాట
- బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): గుజరాత్ రాష్ట్రంలోనూ నీట్ పరీక్ష పత్రం లీకయిందని, ఎగ్జామ్ పేపర్లను విచ్చలవిడిగా అమ్ముకున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నీట్ అక్రమాలపై ప్రధాని మోదీ నోరు తెరవాలని, దేశవ్యాప్తంగా ఈ పరీక్షలో జరిగిన అవకతవకలను నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లో నీట్ పరీక్ష పత్రాలు అమ్ముకున్న వైనంపై ప్రధాని ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలని కోరారు. నీట్ అక్రమాలతో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నిర్లక్ష్య వైఖరి వల్ల తెలంగాణ విద్యార్థులు భారీగా నష్టపోయారని తెలిపారు. ఎడ్యుకేషన్ హబ్‌గా ఉన్న తెలంగాణలో 150 వరకూ ఒక్క ర్యాంకు కూడా రాకపోవడం నీట్ అక్రమాలకు అద్దం పడుతుందని ధ్వజమెత్తారు. గ్రేస్ మార్కుల విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ఇతర దేశాల్లో 14 చోట్ల నీట్ ఎగ్జామ్ నిర్వహించారని, అక్కడా అవకతవకలు జరిగే అవకాశం ఉన్నదని అనుమానం వ్యక్తం చేశారు. నీట్ అక్రమాలపై సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదని, దీనిపై ఇప్పటికైనా తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఎంపీలు నీట్ విద్యార్థుల కోసం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎక్కడ ఉన్నారని, నీట్ అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు రఘురామ్, దశరథ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పటిదాకా చెరిసగం!

- అవార్డు వచ్చేదాకా 'కృష్ణ'లో 50:50 వాటా
- ఇరిగేషన్ అధికారులకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం
- అంతరాష్ట్ర జలవివాదాలపై సమీక్ష



జలసౌధలో ఇరిగేషన్ అధికారులతో ఆదివారం ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తున్న నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, జూన్16 (నమస్తే తెలంగాణ) : ట్రిబ్యునల్ అవార్డు వచ్చేదాకా కృష్ణా జలాలను 50:50 నిష్పత్తిలోనే వినియోగించుకోవాలని, ఆ మేరకు ట్రిబ్యునల్ ఎదుట పునఃసమీక్ష పెట్టి అనుమతుల కోసం కృషి చేయాలని అంతర్రాష్ట్ర జలవిభాగం అధికారులను ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న అంతరాష్ట్ర జలవివాదాలు, వాటి పురోగతి తదితర అంశాలపై జలసౌధలో ఆదివారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. తెలంగాణకు సంబంధించి సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న వివిధ అంతర్రాష్ట్ర జల వివాదాల స్థితిగతులను, కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 (కేడబ్ల్యూడీటీ 2) పురోగతిని మంత్రికి సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వివరించారు. కృష్ణా జలాల వినియోగానికి సంబంధించి 2015లో తెలంగాణ, ఏపీ మధ్య జరిగిన ఒప్పందం తాత్కాలికమేనని, అదీ ఆ ఏడాది కాలానికి మాత్రమేనని వెల్లడించారు. ఆ ఒప్పందాన్ని ట్రిబ్యునల్ ఎదుట పునఃసమీక్ష పెట్టి అవార్డు వచ్చేదాకా కృష్ణా జలాలను చెరిసగం వినియోగించుకునేలా సవరించాలని కోరే యోచనలో ఉన్నట్టు వెల్లడించారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను రివర్ బోర్డుకు అప్పగించే అంశాన్ని వైద్యనాథన్ ప్రస్తావించగా ప్రాజెక్టుల అప్పగింతకు అంగీకరించబోయేది లేదని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఆ మేరకు అసెంబ్లీలోనే తీర్మానం చేశామని గుర్తుచేశారు. కృష్ణాబేసిన్‌లో తెలంగాణ నీటి హక్కులు, ప్రజా ప్రయోజనాలను కాపాడేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న కేడబ్ల్యూడీటీ 2 అవార్డు గురించి కర్నాటక, మహారాష్ట్రతో చర్చించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని సీనియర్ న్యాయవాదులు సూచించగా, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బేసిన్ పరిమితుల ప్రకారం కృష్ణా జలాల్లో తెలంగాణకు చట్టబద్ధత కల్పించాలని, అందుకోసం ఎక్కడా రాజీపడకుండా ముందుకుసాగాలని సూచించారు. ట్రిబ్యునల్, సుప్రీంకోర్టులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో కృష్ణాజల వివాదాలను వాదిస్తున్న ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఇరిగేషన్‌శాఖ సెక్రటరీ రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, సీనియర్ న్యాయవాదులు సీఎస్ వైద్యనాథన్, రవీందర్‌రావు, ఈఎన్సీ నాగేందర్‌రావు, అంతర్రాష్ట్ర జలవిభాగం సీఈ మోహన్‌క